క్లుప్తంగా

విద్యార్థుల ఇండస్ట్రియల్ విజిట్



సోలార్ పవర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న విద్యార్థులు

కంచిలి: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్‌ను బుధవారం చేపట్టారు. ప్రిన్సిపాల్ ఎస్.శివప్రసాద్ అధ్యక్షతన దాలేశ్వరం గ్రామం వద్ద గల సోలార్ పవర్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పలు విషయాలను అవగాహన కల్పించుకొన్నారు. సోలార్ ప్యానల్స్‌తో పవర్ ఏ విధంగా ఉత్పత్తి అవుతుంది, దీన్ని ఎలా నిల్వ చేస్తున్నారు, ఎలా సరఫరా చేస్తున్నారు అనే అంశాలను సైట్ ఇన్‌చార్జిని అడిగి తెలుసుకున్నారు.

చెకుముకి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కంచిలి: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మండలస్థాయి చెకుముకి పరీక్షను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టర్లను, పరీక్ష పత్రాలను హెచ్‌ఎం సీతారాంనాయుడు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. 8, 9, 10 తరగతులకు చెందిన 150 మంది విద్యార్థులు మండలవ్యాప్తంగా సైన్స్ పరీక్షను రాశారు. పరీక్ష మండల కన్వీనర్‌గా పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు తెంబూరు మన్మథరావు వ్యవహరించారు. పీడీ రోజారమణి, ఉపాధ్యాయుడు ఎస్.శరత్ బాబు పర్యవేక్షించారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



భగవతిరావును సన్మానిస్తున్న దృశ్యం

కంచిలి: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు పొందిన జర్జాన భగవతిరావును మండల విద్యాశాఖాధికారులు ఎస్.శివరాంప్రసాద్, కె.చిట్టిబాబు చేతులమీదుగా దుశ్శాలువతో బుధవారం ఘనంగా సన్మానించారు. కంచిలి ఎంపీపీ పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం ఆర్.కామరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కంచిలి జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం సీతారాంనాయుడు, ఎస్‌ఎంసీ చైర్మన్ రమాభిష్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాబూరావుకు సత్కారం

కాశీబుగ్గ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన వజ్జ బాబూరావును పలాసలోని పలువురు బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పరిశ్రమలను అభివృద్ధిచేసి ఎగుమతులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తానని అన్నారు. బాబూరావును సత్కరించిన వారిలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తదితరులున్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు అభినందనలు



కమిషనర్‌ను అభినందిస్తున్న యూనియన్ నాయకులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎన్.రామారావును మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను అభినందిచారు. కమిషనర్‌ను కలిసిన వారిలో యూనియన్ నాయకులు నెయ్యిల గణపతి, సీహెచ్ మురగన్, కె.వెంకటి, బి.కూర్మారావు, ఎం.రవి, కె.బాలక్రిష్ణ ఉన్నారు.

సామాజిక మండపం నిర్మాణాకి భూమిపూజ



భూమిపూజలో ఎమ్మెల్సీ రామారావు, ఎంపీపీ పద్మ

కవిటి: లండారిపుట్టుగ పంచాయతీ పొందూరుపుట్టుగ కోళ్లవీధిలో సామాజిక మండపం నిర్మాణానికి ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపీపీ కడియాల పద్మతో కలిసి బుధవారం భూమిపూజ చేశారు. మండలపరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3 లక్షల వ్యయంతో పనులు చేపడుతున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నర్తు అశోక్, మామిడి సంతోష్ పాల్గొన్నారు.

వ్యక్తిగత ఆరోగ్యంపై అవగాహన

టెక్కలి: వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కోరుతూ వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది బుధవారం టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. వైస్ ప్రిన్సిపాల్ బి.సతీష్‌కుమార్, ఆరోగ్య కార్యకర్త ఎస్.పాపాయమ్మ, సిబ్బంది బి.శ్రావణితో పాటు అధ్యాపకులు ఎ.రామారావు, కె.గొల్ల పాల్గొన్నారు.

• ప్రదర్శన



కంచిలి మండలంలోని జలంత్రకోట గ్రామంలో దసరా ఉత్సవాలు ప్రారంభమైన నేపథ్యంలో ఒడియా రామాయణం నాటక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శన మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు సాగింది. భారీ సినీ సెట్టింగులతో కూడిన ఈ నాటిక అంటే ఈ ప్రాంత ఒడియా వారికి అత్యంత ప్రీతి. ఏటా జలంత్రకోట గ్రామంలో దసరా ఉత్సవాలకు అమ్మవారిని తీసుకొచ్చేరోజున ప్రదర్శించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. – కంచిలి

• శుభరాట

సోంపేట మండలంలోని కొర్లాం గ్రామ పంచాయతీ ప్రధాన రహదారి వద్ద దుర్గా నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించి శుభరాట వేశారు. నవరాత్రి ఉత్సవాలకు ప్రజలు పూర్తి సహాయ సహకారాలు అందజేయాలని కమిటీ సభ్యులు కోరారు. గ్రామస్తులు రాంబుడ్డి జానకీరావు, సంగారు డిల్లేశ్వరరావు, పెద్దింటి జోగారావు పాల్గొన్నారు. – సోంపేట



• సాయం



విజయవాడ వరద బాధితులకు మాజీ సైనికులు తమ వంతు విరాళం అందించారు. ఉద్దాన మాజీ సైనికుల అసోసియేషన్ సేకరించిన 21 వేల రూపాయల చెక్‌ను పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకు తన నివాసంలో అసోసియేషన్ సభ్యులు బుధవారం అందజేశారు. సంఘ సభ్యులు కె.విశ్వనాథం, బి.వీరాస్వామి, కె.ఆదినారాయణ, కె.లింగమూర్తి, పి.కృష్ణారావు, కె.విజయకుమార్, పి.గిరిబాబు, కె.వల్లభరావు, ఎస్.రమేష్‌కుమార్ ఉన్నారు. – కాశీబుగ్గ

మళ్లీ మొదటికొచ్చింది!



మురుగు నీటిలో రాకపోకలు సాగిస్తున్న స్థానికులు

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీలో మురుగు నీటి సమస్య మళ్లీ మొదటికొచ్చింది. టెక్కలి నుంచి తొలుసూరుపల్లికి వెళ్లే మార్గంలో జామి రమణయ్య రైస్ మిల్లు ఎదురుగా రోడ్డుపై మురుగుతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. గతంలో ఇదే రోడ్డుపై మోకాలి లోతుగా మురుగు నీటి సమస్య ఉండేది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఈ సమస్యను పరిష్కరించే విధంగా ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన మురుగు నీటిని మళ్లించే చర్యలు చేపట్టారు. ఇప్పుడు మురుగు నీరు వెళ్లకుండా అడ్డంగా మట్టి వేయడంతో ఆ సమస్య మొదటికొచ్చింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారంతా అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా పాఠశాలకు వెళ్లే చిన్నారులు మురుగు నీటి నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. వాహనదారులు కూడా అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా పంచాయతీ యంత్రాంగం స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

మాజీ మంత్రి సీదిరి పరామర్శ



కాశీబుగ్గ: తిరుపతిరావును పరామర్శిస్తున్న మాజీ మంత్రి అప్పలరాజు



టెక్కలి:గణపతితో మాట్లాడుతున్న తిలక్, నాయకులు



ఇచ్ఛాపురం రూరల్:పరామర్శలో ఉపాధ్యాయులు



కవిటి: ప్రకాష్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న రామారావు

కాశీబుగ్గ: మందస, పలాస మండలాల పరిధిలోని పలు కుటుంబాలను మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు బుధవారం పరామర్శించారు. గుండె చికిత్స చేయించుకున్న పలాస మండలం సున్నాదేవి గ్రామానికి చెందిన గొరకల శారద, రోడ్డు ప్రమాదాల్లో గయాపడిన మందస మండలం సువర్ణపురం గ్రామానికి చెందిన ఇప్పిలి కామేశ్వరి, బలెమెరి దాలమ్మ, కొత్తపల్లి ఊర్వశి, చుక్క తిరుపతిరావులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. పిడిమందసకు చెందిన ఉగ్గిరపల్లి ఆదినారాయణ, బెల్లుపటియాకి చెందిన సంక గురుమూర్తిలు ఇటీవల మరణించడంతో వారి కుటుంబాలను పరామర్శించి సానుభూతి తెలియజేశారు.

తిలక్ పరామర్శ

టెక్కలి: టెక్కలికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చింతాడ గణపతి, మంజు కుటుంబాన్ని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ పరామర్శించారు. మారేడుమిల్లి జల పాతం ఘటనలో గణపతి, మంజు కుమార్తె హారిణిప్రియ తీవ్రంగా గాయపడి రాజమండ్రిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ విషయం తెలుసుకున్న తిలక్‌తో పాటు పీఏసీఎస్ మాజీ చైర్‌పర్సన్ సత్తారు సత్యం, కోటబొమ్మాళి జెడ్పీటీసీ సభ్యుడు దుబ్బ వెంకట్రావు, నాయకులు అన్నెపు రామారావు, పేడాడ వెంకట్రావు తదితరులు రాజమండ్రి చేరుకుని గణపతి, మంజులను పరామర్శించి వారి కుమార్తె ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

సర్పంచ్‌కు ఎమ్మెల్సీ పరామర్శ

కవిటి: బిగొనపపుట్టుగ సర్పంచ్, సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు బద్రి ప్రకాష్ తల్లి రవణమ్మ మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు ప్రకాష్ కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు.

విద్యార్థి కుటుంబానికి..

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి కాయ రిత్విక్ అనారోగ్యంతో మృతి చెందాడు. కేశుపురంలో ఉంటున్న విద్యార్థి కుటుంబ సభ్యులను ఉపాధ్యాయులు పరామర్శించి.. రూ.7 వేలు నగదును అందజేశారు. ప్రధానోపాధ్యాయులు బి.తమ్మయ్య ఉన్నారు.

మారుతున్న కాలానికి అనుగుణంగా రచనలు చేయాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

టెక్కలి: మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానంలో నూతన రచనలు చేయాలని టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు సూచించారు. కళాశాలకు చెందిన అధ్యాపకులు మాదిన జయంతిరావు, టి.చలపతిరావు, పి.ఆంజనేయులు సంయుక్తంగా రచించిన ఎసెన్సియల్ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ అండ్ బ్లాక్ చైన్ అనే పుస్తకాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ సెక్యూరిటీలో అధునాతన పద్ధతులపై రచించిన ఈ పుస్తకాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ డి.శ్రీరాములు, కె.వేణుగోపాల్, వై.రమేష్ పాల్గొన్నారు.

లడ్డూ వ్యవహారంపై సుప్రీం కోర్టు జడ్జితో విచారణ చేయాలి

• ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్



టెక్కలి: తిరుమల లడ్డూ వ్యవహారంపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ చేయాలని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు వంద రోజుల పాలనపై ప్రజల్లో వ్యతిరేకత చోటు చేసుకోవడంతో కావాలనే లడ్డూ ప్రసాదాన్ని రాజకీయంగా వాడుకుంటున్నారని మండిపడ్డారు. లడ్డూ కల్తీపై అన్ని రకాల పరీక్షలు నిర్వహించి సక్రమంగా ఉందని చెబుతున్నప్పటికీ అవేమి పట్టించుకోకుండా భక్తుల మనోభావాలను దెబ్బ తీసే విధంగా చంద్రబాబు వ్యవహారం నీచంగా ఉందన్నారు. లడ్డూ వ్యవహారాన్ని ఇతర మతాలతో ముడిపెడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ మాట్లాడడం బాధాకరమన్నారు. చంద్రబాబు తన తప్పు తెలుసుకుని భక్తులకు క్షమాపణలు చెప్పాలన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి



వజ్రపుకొత్తూరు: మొక్కలు నాటుతున్న డీఎల్‌పీవో ఐ.వి.రమణ తదితరులు

వజ్రపుకొత్తూరు: పచ్చదనం, పరిశుభ్రతకు ప్రతిఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని టెక్కలి డీఎల్‌పీఓ ఐ.వి.రమణ అన్నారు. దేవునల్తాడ, పాతటెక్కలి గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామ సచివాలయాల ఆవరణలో మొక్కలు నాటారు. తిత్లీ తుపాను తరువాత ఉద్దానంలో కరువైన పచ్చదనాన్ని మళ్లీ తీసుకురావాలంటే ప్రతీ ఒక్కరూ ఉద్యమంలా మొక్కలను నాటాలని పిలుపునిచ్చారు. పాతటెక్కలి సర్పంచ్ తుంగాన సుశీల, దేవునల్తాడ సర్పంచ్ టి.వరదరాజు, మాజీ సర్పంచ్‌లు పిరియా శివప్రసాద్, రమణమూర్తి, పంచాయతీ కార్యదర్శులు సీహెచ్ మధు, కె.కామరాజు పాల్గొన్నారు.

☛ ఇచ్ఛాపురం: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ దినవారి బజారును శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర పర్యవేక్షణలో పరిశుభ్రం చేశారు. పరిసరాల పరిశుభ్రతపై వ్యాపారులతో ప్రతిజ్ఞ చేయించారు. సచివాలయ సిబ్బంది, ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శి పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇప్పించాలని వినతి



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో భరత్ నాయక్

కాశీబుగ్గ: బొడ్డపాడు రెవెన్యూ పరిధిలో 150 ఎకరాలను ఎంఐజీ ఇళ్ల స్థలాల కోసం భూములు ఇచ్చిన తమకు న్యాయం చేయాలని రైతులు కోరారు. తమకు కూడా ఇళ్ల స్థలాలు ఇప్పించాలని పలాస ఆర్డీవో భరత్ నాయక్‌కు బొడ్డపాడు రైతులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తన కార్యాలయంలో ఆర్డీవోను బుధవారం కలిశారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, ఏపీ టిడ్కో ఇళ్ల కోసం భూములు ఇచ్చిన తమకు నష్టపరిహారం ఇవ్వలేదని ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. తన పరిధిలో ఉన్న సమస్యను పరిష్కరిస్తానని, ఇతర సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని ఆర్డీఓ భరత్ నాయక్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బొడ్డపాడు సర్పంచ్ తామాడ మదన్, ఎంపీటీసీ సభ్యుడు మద్దిల పాపారావు, గ్రామ పెద్దలు మద్దిల మల్లేశ్వరరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మద్దిల రామారావు, మెట్టూరు అప్పారావు ఉన్నారు.

ఉల్లాసంగా స్కూల్ గేమ్స్ ఎంపికలు



ఇచ్ఛాపురం: హైజంప్ చేస్తున్న విద్యార్థి



టెక్కలి: నియోజకవర్గస్థాయి క్రీడల్లో ఎంపికైన క్రీడాకారులు

ఇచ్ఛాపురం: నియోజకవర్గస్థాయి ఎస్జీఎఫ్ (స్కూల్‌గేమ్స్‌ఫెడరేషన్) అథ్లెటిక్స్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. స్థానిక సురంగిరాజా క్రీడా మైదానం ఆవరణలో బుధవారం జోన్–1 వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు కె.పద్మనాభం రెడ్డి అధ్యక్షతన అండర్–14, 17 విభాగాల్లో బాలబాలికలకు నియోజకవర్గ స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల నుంచి 263 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇక్కడ ఎంపికై న క్రీడాకారులు శ్రీకాకుళంలో నిర్వహించే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని జోన్–1 వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు తెలిపారు. ఎంపిక ప్రక్రియలో నాలుగు మండలాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా స్కూల్ గేమ్స్ ఎంపికలు

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నియోజకవర్గస్థాయి స్కూల్ గేమ్స్ ఎంపికలు జరిగాయి. నాలుగు మండలాల నుంచి మొత్తం 60 పాఠశాలల చెందిన 700 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎంఈవోలు డి.తులసీరెడ్డి, డి.చిన్నారావు తదితరులు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, యోగా తదితర క్రీడలను ప్రారంభించారు. నియోజకవర్గ స్పోర్ట్స్ అధికారి బి.నారాయణరావు, కె.కె.రామిరెడ్డి, జి.శ్రీనివాసరావు, పి.తిరుపతిరావు, సీహెచ్ వాసుదేవరావు, ఎం.జనార్దనరావు, ఎన్.రమేష్, ఆదిశేషు, జగ్గమ్మ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

కోర్టు భవనాల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలి

టెక్కలి: డివిజన్ కేంద్రమైన టెక్కలిలో కోర్టు సముదాయాల భవనాల నిర్మాణాలకు పరిపాలనా అనుమతులు, నిధులు మంజూరు చేయాలని టెక్కలి బార్ అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ తీర్మానం చేశారు. ఈ మేరకు బుధవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.వి.వివేకానంద మాట్లాడుతూ.. ప్రస్తుతం నిర్వహిస్తున్న కోర్టు భవనాల్లో వర్షాల సమయంలో న్యాయవాదులు, కక్షిదారులు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. కార్యదర్శి ఎస్.దివాకర్, వైస్ ప్రెసిడెంట్ డి.ధర్మారావు, సభ్యులు పి.బాబురావు, పి.సాయిరాజు, ఎం.గోవింద్ ఉన్నారు.

28న ఆలయాల్లో పూజలు చేయాలి

వజ్రపుకొత్తూరు: మండల వ్యాప్తంగా ఈ నెల 28న వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు ఆయా గ్రామాల పరిధిలోని ఆలయాల్లో పూజలు చేయాలని ఎంపీపీ ఉప్పరపసల్లి నీలవేణి, వైఎస్సార్‌సీపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం వారు మాట్లాడుతూ.. తిరుమల పవిత్రతను, స్వామివారి ప్రసాదం విశిష్టతను, వేంకటేశ్వర స్వామి వైభవాన్ని టీటీడీ పేరు ప్రఖ్యాతులను, లడ్డూ పవిత్రతను రాజకీయ దురుద్దేశంతో సీఎం చంద్రబాబు అపవిత్రం చేశారన్నారు. ఈ పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు ఆలయాల్లో పూజలు చేయాలని కోరారు

ద్విచక్ర వాహనం చోరీపై ఫిర్యాదు

టెక్కలి రూరల్: తన రాయల్ ఎన్‌ఫీల్డ్ ద్విచక్ర వాహనం చోరీకి గురైందని అయ్యప్పనగర్‌కు చెందిన సచివాలయ ఉద్యోగి యర్ర మనోజ్ ఫిర్యాదు చేసినట్టు టెక్కలి పోలీసులు బుధవారం తెలిపారు. తన ఇంటి ముందు పార్కు చేసి ఉంచిన వాహనం బుధవారం ఉదయం చూసేసరికి కనిపించలేదని ఫిర్యాదులో పేర్కొన్నట్టు చెప్పారు.

గెస్ట్ లెక్చరర్ ఉద్యోగానికి దరఖాస్తులు ఆహ్వానం

ఇచ్ఛాపురం: స్థానిక ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో జువాలజీ సబ్జెక్టు బోధించేందుకు గెస్ట్‌లెక్చరర్ పోస్టుకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్న ప్రిన్సిపాల్ వి.శంకర్‌రావు తెలిపారు. పీజీలో 55 శాతం మార్కులు ఉండాలని, మహిళా అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 27వ తేదీ సాయంత్రంలోగా దరఖాస్తులను కళాశాలకు దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ఈ నెల 28వ తేదీ ఉదయం పది గంటలకు కళాశాల ఆవరణలో నిర్వహించే మౌఖిక పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు.

120 మందికి నేత్ర పరీక్షలు

కాశీబుగ్గ: పలాస సత్యసాయి మందిరంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ వైద్యులు హాజరై 120 మందికి పరీక్షలు చేశారు. వీరిలో 60 మందికి శస్త్రచికిత్సలకు ఎంపిక చేసి తరలించారు. సత్యసాయి సేవా సమితి కన్వీనర్ జగదీష్, జిల్లా సాధన శిబిరం ఇన్‌చార్జి జేసీహెచ్ శ్రీనివాస్, బి.కామేశ్వరరావు కొండలరావు పాల్గొన్నారు.

బాలుకి ఘనంగా నివాళి

కంచిలి: గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నాలుగో వర్ధంతిని జాడుపూడిలో కళాకారులు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలు చిత్రపటానికి పూలమాలలు వేసి స్వర నివాళులర్పించారు. ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట మండలాల కళాకారుల సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు. బాలు పాడిన చిత్రగీతాలను ఆలాపించారు. కళాభారతి కళాకారుల సంఘ అధ్యక్షుడు పిలక సోమేశ్, దేవేంద్రనాథ్ పండా పాల్గొన్నారు.

☛ ఇచ్ఛాపురం: స్థాని వేంకటేశ్వర డాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో బాలు వర్ధంతిని నిర్వహించారు. నాట్యగురువు శృతిపట్నాయక్, కళాకారులు కావ్య, శైలు, పూజశ్రీ,లక్ష్మి, మణికుమారి, గుణవతి, నిత్యానంద బాడిత్య పాల్గొన్నారు.